గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

శ్రీకాకుళం : డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల, కళాశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోవాలని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ మార్పు జ్యోతి అన్నారు. నగరంలోని పెద్దపాడులో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఐదో తరగతిలో ప్రవేశానికి విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామన్నారు. ఎస్‌సి 70, ఎస్‌టి 5, బిసి 4, ఒసి 1, ఇంటర్మీడియట్‌లో ప్రవేశానికి బైపిసి 40, ఎంపిసి 40 సీట్లు భర్తీ చేయనున్నట్లు తెలిపారు. ఈనెల 23 నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తున్నామన్నారు. మూడు, నాలుగు తరగతులు గుర్తింపు పొందిన పాఠశాలలో చదివి, వార్షికాదాయం రూ.లక్ష లోపు ఉండి, సొంత జిల్లా వారు అర్హులని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న వారికి ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. ఇంటర్‌లో ప్రవేశాలకు ఈ ఏడాది ఆగస్టు 31వ తేదీ నాటికి 17 ఏళ్లు దాటని విద్యార్థులు అర్హులని స్పష్టం చేశారు.

- ఎన్నికలు సమీపిస్తుండడంతో గ్రామాల్లోకి అచ్చెన్నాయుడు
- నాలుగున్నరేళ్లుగా నియోజకవర్గ సమస్యలు పట్టని వైనం
- పోర్టు కోసం పంటలను తొక్కిస్తే ఎక్కడున్నారంటూ జనంలో చర్చ

ఇన్నాళ్లకు గుర్తొచ్చారు

పండగ వేళ హరిదాసులు, డుడూ బసవన్నలు వచ్చినట్లు ఎన్నికల సమీపిస్తుండడంతో కొందరు ప్రజాప్రతినిధులు గ్రామాల బాట పడుతున్నారు. నాలుగున్నరేళ్లుగా నియోజకవర్గ సమస్యలు పట్టించుకోని నేతలు తీరిగ్గా ఇప్పుడు జనం సమస్యలను తెలుసుకుంటున్నారు. క్యాంపు కార్యాలయాల్లో కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించి అమరావతి, విశాఖ వంటి ఇతర ప్రాంతాల్లో ఎక్కువ కాలం గడిపిన నేతలు ప్రజలు దగ్గరయ్యేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఓట్ల కోసం ఎన్నికల ముందు వస్తారు, ఆ తర్వాత పట్టించుకోరన్న నానుడిని నిజం చేస్తూ టెక్కలి ఎమ్మెల్యే, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు గ్రామాలను చుట్టుముడుతున్నారు.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

టెక్కలి నియోజకవర్గంలో మూలపేట పోర్టును నిర్మించే క్రమంలో ప్రభుత్వం అనేక అడ్డదారులు తొక్కింది. సంతబొమ్మాళి మండలం మూలపేట, విష్ణుచక్రం గ్రామాలకు చెందిన ప్రజలను అనేక ఇబ్బందులకు గురిచేసింది. రైతులు వ్యతిరేకిస్తున్నా బలవంతంగా భూములను తీసుకుంది. ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కోసం ఇళ్లు, పశువుల శాలలు తదితర స్ట్రక్చర్ల విలువ కోసం పోలీసు బలగాలను పెట్టి బలవంతంగా చేయించారు. పోర్టు నిర్మాణం విషయంలో ప్రభుత్వ తీరును ప్రశ్నించిన వారిపై బైండోవర్ కేసులు సైతం నమోదు చేశారు. పోర్టుకు భూములు ఇవ్వని వారి పంటలను బుల్డోజర్లతో తొక్కించారు. నిర్వాసితులకు జరుగుతున్న అన్యాయంపై సిపిఎం పలు పోరాటాలు సాగించింది. అయినా ప్రభుత్వం మొండివైఖరితో ముందుకు సాగింది. ధ్వంసమైన పంట పొలాలను పరిశీలించేందుకు వెళ్లిన సిపిఎం నాయకులకు అరెస్టులు చేయించింది. ఇంత జరిగినా టెక్కలి ఎమ్మెల్యే, ప్రధాన ప్రతిపక్ష పార్టీ రాష్ట్ర అధ్యక్ష స్థానంలో ఉన్న కింజరాపు అచ్చెన్నాయుడు ఏనాడూ అటువైపు కన్నెత్తి చూడలేదు. ప్రభుత్వ చర్యలపై ఆ ప్రాంత ప్రజల ప్రతినిధిగా ప్రశ్నించడం, అడ్డుకునే ప్రయత్నాలు చేసి ఉంటే నిర్వాసితుల న్యాయమైన డిమాండ్లు కొంతవరకైనా నెరవేరేవన్న చర్చ అప్పట్లో సాగింది.

మృత్యువాత పడినా దిక్కు లేని పరిస్థితి

టెక్కలి పాతబస్టాండ్ సమీపంలో గతేడాది అక్టోబర్ 16న పోర్టు వాహనం ఢీకొని శ్రీరామ కాలనీకి చెందిన ఓ యువకుడు మృతి చెందాడు. టెక్కలి మండలం నారాయణపురం వద్ద గతేడాది డిసెంబర్ 22న పోర్టు వాహనాన్ని వెనుక నుంచి ఢీకొని సంతబొమ్మాళి మండలం నౌపడ గ్రామానికి చెందిన శేషు అనే యువకుడు మృతి చెందాడు. కాంట్రాక్టు పనులు పర్యవేక్షిస్తున్న వైసిపి

నందిగాం మండలం కవిటి అగ్రహారంలో వృద్ధురాలిని హత్తుకొని పలకరిస్తున్న అచ్చెన్నాయుడు (ఫైల్)

టెక్కలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి, ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ రూ.మూడు లక్షలు ఇచ్చేందుకు అంగీకరించినా బాధిత కుటుంబం తిరస్కరించింది. గతేడాది ఆగస్టు 14న సంతబొమ్మాళి మండలం హనుంతనాయుడుపేట పంచాయతీ సీతారాంపురానికి చెందిన లక్ష్మీనారయణ పోర్టు నిర్మాణ పనులు చేసేందుకు వెళ్తున్న క్రమంలో పోర్టుకు చెందిన టిప్పరు ఢీకొనడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. వీరంతా ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గానికి చెందిన బాధితులే. వీరికి పరిహారం చెల్లించాలనే డిమాండ్‌నూ ప్రభుత్వం ముందుంచలేదు. కనీసం ఆ కుటుంబాలను పరామర్శించనూ లేదు.

కరువుతో అల్లాడుతున్నా కదల్లేదు

నియోజకవర్గంలో మూడేళ్లుగా సాగునీరందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. టెక్కలి, నందిగాం మండలాల్లో శివారు ప్రాంతాలకు వంశధార నీరు అందకపోవడంతో పంటలు ఎండిపోయాయి. గతేడాది ఖరీఫ్‌లో నందిగాంలో 3,800 ఎకరాలు, సంతబొమ్మాళి మండలంలో 968 ఎకరాలు ఎండిపోయాయి. ఈ సంవత్సరం పరిస్థితి మరీ దారుణంగా ఉంది. వేలాది ఎకరాల్లో రైతులు పంటలు వేయలేకపోయారు. కొన్నిచోట్ల వేసిన పంటలూ ఎండిపోయాయి. పశుసంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు ఆదేశాలతో కోటబొమ్మాళి మండలంలోని పలు ఎత్తిపోతల పథకాలకు నీరు ఆపేయడంతో రైతులు తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. ఈ సమయంలోనూ పెద్దగా స్పందించలేదు. ఎండిపోయిన పంట పొలాలను పరిశీలించేందుకు సైతం ఎమ్మెల్యేకు తీరిక లేకపోయింది.

తీరిగ్గా పలకరింపులు.. పరామర్శలు

టిడిపి అధికారం కోల్పోయిన తర్వాత ఎమ్మెల్యే అచ్చెన్నాయుడు ఈ నాలుగున్నరేళ్లలో నియోజకవర్గానికి చాలా తక్కువ సమయం కేటాయించారు. ఆయన క్యాంపు కార్యాలయానికి పార్టీ నాయకులు రావడమే తప్ప జనంలోకి వెళ్లిన సందర్భాలు వేళ్లపై లెక్క పెట్టొచ్చు. టిడిపికి రాష్ట్ర అధ్యక్షునిగా వ్యవహరిస్తుండడంతో అమరావతి, ఇతర జిల్లాల్లో పర్యటనలకు ప్రాధాన్యం ఇచ్చారు. విశాఖలోని తన నివాసంలో ఎక్కువ రోజులు గడిపేవారు. తనను ఎన్నుకున్న నియోజకవర్గ ప్రజలకు, వారి సమస్యలను వినేందుకు మాత్రం పెద్దగా సమయం కేటాయించలేదన్న చర్చ ఆ పార్టీ నాయకుల్లో సైతం సాగుతోంది. ఎన్నికల నేపథ్యంలో ఓట్ల కోసం పలకరింపులు, పరామర్శలతో ఇప్పుడు గ్రామాల్లో కలియతిరుగుతున్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

తప్పిదాలకు ఇఆర్‌ఒలదే పూర్తి బాధ్యత

- ఎలక్ట్రోరల్ నమోదు, తొలగింపుల్లో అలసత్వం వద్దు
- కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో ఓటర్ల నమోదు, పరిశీలన, తొలగింపుల్లో ఎలాంటి తప్పులు దొర్లినా ఇఆర్‌ఒలదే బాధ్యత అని కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ అన్నారు. సాధారణ ఎన్నికల-2024 సన్నద్ధతపై ఎస్‌పి జి.ఆర్ రాధిక, జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్‌తో కలిసి ఎలక్ట్రోరల్, నోడల్ అధికారులు, జిల్లా అధికారులతో కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శుక్రవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సంఘం సూచనలు, ఎన్నికల విధులపై నిర్లక్ష్యం వహించరాదన్నారు. క్షేత్రస్థాయి నుంచి ఉన్నత స్థాయి అధికారుల వరకు అప్రమత్తంగా ఉంటూ సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు. జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ మాట్లాడుతూ నోడల్ అధికారులు వారికి కేటాయించిన విధులను నిర్వహించాలన్నారు. పెండింగులో ఉన్న ఫారం-6తో పాటు మృతి చెందిన ఓటర్లు, వలస ఓటర్లపై క్షేత్రస్థాయి పరిశీలన చేయాలని సూచించారు. నియోజకవర్గాల వారీగా పెండింగ్‌లో ఉన్న ఓట్లపై త్వరితగతిన పరిశీలన చేపట్టాలన్నారు. టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ టెక్కలి డివిజన్ పరిధిలో ఎలక్ట్రోరల్‌పై తీసుకుంటున్న చర్యలను వివరించారు. ఇచ్ఛాపురం, పలాస నియోజకవర్గాలకు సంబంధించి పలాస ఆర్‌డిఒ భరత్ నాయక్ వివరించారు. షిఫ్టింగ్, చేర్పులకు సంబంధించి జాగ్రత్తగా పరిశీలించాలని కలెక్టర్ సూచించారు.

బిఎల్‌ఒలకు డెత్ కేసులపై అవగాహన ఉంటుందని, అటువంటి వాటిని పరిశీలించాలన్నారు. తప్పుడు డోరు నంబర్లు, ఫారం వైజ్‌గా డేటా అందజేయాలన్నారు. డూప్లికేట్, తొలగింపులను జాగ్రత్తగా పరిశీలించాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల వద్ద మౌలిక సదుపాయాల కల్పనపై అశ్రద్ధ వహించరాదన్నారు. ఎన్నికల నిర్వహణ సిబ్బంది, ఫ్లయింగ్ స్క్వాడ్స్ తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. స్వీప్ సమావేశాలపై డిఆర్‌డిఎ పీడీ విద్యాసాగర్ వివరించారు. జిల్లాలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులను ఎస్‌పి రాధిక వివరించారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, ఆర్‌డిఒ సిహెచ్.రంగయ్య, ఉప కలెక్టర్లు పద్మావతి, అప్పారావు, నోడల్ అధికారులు డిపిఒ రవికుమార్, జెడ్‌పి సిఇఒ వెంకట్రామన్, డిఇఒ వెంకటేశ్వరరావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్‌ఇ ప్రసాదరావు, సమగ్ర శిక్ష ఎపిసి జయప్రకాష్, సిపిఒ లక్ష్మీప్రసన్న, హౌసింగ్, ఐసిడిఎస్ పీడీలు గణపతిరావు, శాంతిశ్రీ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఇఒ హరి సూర్యప్రకాష్

16న రథసప్తమి ఉత్సవాలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఈనెల 16న అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో రథసప్తమి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి (ఇఒ) వి.హరి సూర్యప్రకాష్ తెలిపారు. రథసప్తమి ఏర్పాట్లపై ఆలయంలోని సమావేశ మందిరంలో పాలకమండలి సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈనెల 15న అర్ధరాత్రి నుంచి వేడుకలు ప్రారంభం కానున్న నేపథ్యంలో క్యూలైన్లు, వచ్చే యాత్రికులకు తాగునీరు, ఆహారం, పిల్లలకు పాలు, వైద్య సేవలు, విద్యుద్దీపాలంకరణ, ఇంద్ర పుష్కరిణి వద్ద స్నానఘట్టాలు, దుస్తులు మార్చుకునేందుకు అవసరమైన తాత్కాలిక షెడ్ల ఏర్పాటు, పార్కింగ్, వివిఐపిల తాకిడి, దాతల ప్రవేశ ఏర్పాట్లు, ప్రసాదం విక్రయ కౌంటర్ల నిర్వహణ, క్షీరాభిషేకం, పలు అలంకరణ సేవల నిర్వహణ తదితర అంశాలపై సభ్యులు చర్చించారు. ఈ సందర్భంగా ఇఒ మాట్లాడుతూ ఏటా రథసప్తమి వేడుకలకు యాత్రికుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు చేపట్టనున్నట్లు చెప్పారు. సమావేశంలో ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

కమిషనర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కార్పొరేషన్ అధికారులు

అందరి సహకారంతో అభివృద్ధి

నగరపాలక సంస్థ కమిషనర్ తమీమ్ అన్సారియా

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

అందరి సహకారంతో శ్రీకాకుళం నగరాన్ని అభివృద్ధి చేస్తానని శ్రీకాకుళం నగర కార్పొరేషన్ నూతన కమిషనర్ తమీమ్ అన్సారియా అన్నారు. కార్పొరేషన్ కమిషనర్‌గా శ్రీకాకుళం నగరపాలక సంస్థ కార్యాలయంలో శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. చీఫ్ ఇంజినీరు పి.సుగుణాకరరావు, మెప్మా పీడీ కిరణ్ కుమార్, ఉద్యానవన శాఖ ఎడి ప్రసాద్, పబ్లిక్ హెల్త్ డాక్టర్ వెంకటరావు తదితరులు ఆమెకు స్వాగతం పలికారు. పలు విభాగాల అధికారులు, సిబ్బంది ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఘన చరిత్ర కలిగిన ఈ నగరానికి ఎంతో పేరు ప్రఖ్యాతులు ఉన్నాయన్నారు. ఇక్కడి ప్రజలకు మరింత మెరుగైన మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని చెప్పారు. నగరంలో మరింత మెరుగైన పారిశుధ్య నిర్వహణ, పార్కింగ్ సౌకర్యాలు, ప్రజా మరుగుదొడ్లు, పట్టణ ప్రణాళికా విభాగం, మున్సిపల్ పార్కులను మెరుగుపరుస్తామని తెలిపారు. ప్రజలు, ప్రజాసంఘాలు, ఎన్‌జిఒలు, నగరపాలక సిబ్బంది సహకారంతోనే ఇది సాధ్యమవుతుందన్నారు. గతంలో ఉత్తరప్రదేశ్ రాష్ట్రం ఫతేపూర్ జిల్లా చీఫ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్‌గా పనిచేసిన అనుభవం శ్రీకాకుళం నగరపాలక సంస్థ అభివృద్ధికి తోడ్పడుతుందని చెప్పారు.

తహశీల్దార్లకు పోస్టింగులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఎన్నికల సంఘం ఆదేశాలను అనుసరించి ప్రభుత్వం ఇతర జిల్లాల నుంచి జిల్లాకు కేటాయించిన 41 మంది తహశీల్దార్లకు పలుచోట్ల పోస్టింగ్‌లు కేటాయించారు. ఈమేరకు కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

పేరు	ప్రాంతం
కె.వి ఈశ్వరరావు	ఎఒ, కలెక్టరేట్
బి.కూర్మనాథ్	కలెక్టరేట్ సి-సెక్షన్ సూపరింటెండెంట్
ఎ.మనోరంజన్	కలెక్టరేట్ డి-సెక్షన్ సూపరింటెండెంట్
పి.రామారావు	కలెక్టరేట్ ఇ-సెక్షన్ సూపరింటెండెంట్
బి.టి.వి రామారావు	కలెక్టరేట్ హెచ్-సెక్షన్ సూపరింటెండెంట్
ఆర్.నర్సింహమూర్తి	ఎఒ, ఆర్‌డిఒ, శ్రీకాకుళం
బి.నాగరాజు	ఎఒ, టెక్కలి సబ్‌కలెక్టర్
జె.సత్యనారాయణ	ఎఒ, పలాస ఆర్‌డిఒ
పి.లక్ష్మీదేవి	కెఆర్‌ఆర్‌సి, శ్రీకాకుళం
జె.తారకేశ్వరి	కెఆర్‌ఆర్‌సి, టెక్కలి
డి.వీరభద్రరావు	గెయిల్
బి.వి రాణి	శ్రీకాకుళం
ఎం.శ్రీనివాస్	గార
కె.వేణుగోపాల్	ఆమదాలవలస
ఎం.పాల్ కిరణ్	పొందూరు
జె.రమేష్‌బాబు	సరుబుజ్జిలి
ఎస్.వి అంబేద్కర్	బూర్జ
పి.కనకారావు	నరసన్నపేట
ఎస్.ఎల్.వి ప్రసాద్	పోలాకి
సిహెచ్.నాగమ్మ	జలుమూరు
పి.భాగ్యవతి	సారవకోట
ఇ.శ్యామ్‌కుమార్	ఎచ్చెర్ల
ఎల్.రామారావు	రణస్థలం
బి.రవికుమార్	జి.సిగడాం
పి.ఆదిలక్ష్మి	లావేరు
ఆర్.బాలమురళి	టెక్కలి
పి.లచ్చుపాత్రుడు	కోటబొమ్మాళి
సి.జి సత్యనారాయణ	సంతబొమ్మాళి
వి.పద్మావతి	నందిగాం
వైఎస్.వి ప్రసాదరావు	పాతపట్నం
బి.నాగజ్యోతి	హిరమండలం
ఎం.వి ప్రసాద్	కొత్తూరు
ఎస్.రాణి అమ్మాజీ	ఎల్.ఎన్‌పేట
కె.జానకమ్మ	మెళియాపుట్టి
ఎస్.ఎస్.వినాయుడు	పలాస
ఎల్.తిరుమలబాబు	మందస
ఎం.సురేష్	వజ్రపుకొత్తూరు
ఎం.వి అప్పారావు	ఇచ్ఛాపురం
ఎం.లక్ష్మి	కవిటి
ఎం.వి.కె.ఎస్ రవి	కంచిలి
కె.విజయ్ కుమార్	సోంపేట

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా ఉన్నతాధికారులు

జాగ్రత్తగా చేర్పులు, తొలగింపులు

శ్రీకాకుళం : ఎలక్ట్రోరల్ చేర్పులు, మార్పులు జాగ్రత్తగా పరిశీలించాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా అధికారులను ఆదేశించారు. డ్రాఫ్ట్ పబ్లికేషన్ నాటికి పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల స్థితి, ఎస్ఎస్ఆర్-24 సమయంలో స్వీకరించిన ఫారాలు, ముసాయిదా జాబితాపై ఓట్ల చేర్పులు, తొలగింపులు, సవరణలు, 2024 సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి పోలింగ్ కేంద్రాల భద్రత తదితర అంశాలపై విజయవాడలోని ఎన్నికల ప్రధాన అధికారి కార్యాలయం నుంచి శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫైనల్ పబ్లికేషన్ అయిన తర్వాత వచ్చిన దరఖాస్తులను పరిశీలన చేయకుండా అప్రూవల్ చేయకూడదని స్పష్టం చేశారు. కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ జిల్లాలో ఎలక్ట్రోరల్ రోల్స్ ఫైనల్ పబ్లికేషన్ అయిన తర్వాత వచ్చిన దరఖాస్తుల గురించి వివరించారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన మౌలిక సదుపాయాలు, ఎన్నికల విధులు నిర్వహణ సిబ్బంది, జిల్లాలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులు తదితర అంశాలను వివరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమర్, అసిస్టెంట్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, ఆర్‌డిఒలు ఎస్.భరత్ నాయక్, సిహెచ్.రంగయ్య, ఉప కలెక్టర్లు పద్మావతి, అప్పారావు, జెడ్‌పి సిఇఒ ఆర్.వెంకట్రామన్ తదితరులు పాల్గొన్నారు.

సిక్కోలు డ్వాక్రా బజారుకు రూ.50 వేలు సాయం

శ్రీకాకుళం అర్బన్ : నగరంలోని మున్సిపల్ మైదానంలో గత నెల 3నుంచి 9వరకు ఆరు రోజులపాటు సిక్కోలు డ్వాక్రా బజారు నిర్వహించారు. ఈ బజారు నిర్వహణకు డిఆర్‌డిఎ అధికారులు వివిధ బ్యాంకుల సహకారాన్ని కోరారు. ఇందుకుగాను యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా, రీజనల్ కార్యాలయం అధికారులు రూ.50 వేలు చెక్కును శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో లీడ్‌బ్యాంకు మేనేజరు సూర్యకిరణ్, యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా రీజినల్ హెడ్ ఎం.వి.తిలక్, చీఫ్ మేనేజర్ దుర్గాప్రసాద్, సర్వీసెస్ మేనేజరు మురళీకృష్ణలు పాల్గొన్నారు.

వైద్యారోగ్యశాఖలో ఇద్దరు సూపరింటెండెంట్లు సస్పెన్షన్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయం, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి కార్యాలయ సూపరింటెండెంట్లు భాస్కర్ కుమార్, శ్రీనివాసాచార్యులను సస్పెండ్ చేస్తూ వైద్యారోగ్యశాఖ రీజనల్ డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. హెల్త్ అసిస్టెంట్ నియామకాల్లో పెద్దఎత్తున అవకతవకలు జరిగాయని, వైద్యారోగ్యశాఖ కార్యాలయ సూపరింటెండెంట్ భాస్కర్ కుమార్, అప్పుడు సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న శ్రీనివాసాచార్యులు ప్రమేయంపై ఆరోపణలు వచ్చాయి. దీంతో అప్పటి కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ వీరిని సస్పెండ్ చేయాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బొడ్డేపల్లి మీనాక్షికి సిఫార్సు చేశారు. ఆమేరకు రీజనల్ డైరెక్టర్‌కు లేఖ రాయడంతో వీరిద్దరినీ సస్పెండ్ చేస్తూ గురువారం రాత్రి ఉత్తర్వులు వెలువడ్డాయి. వైద్యారోగ్యశాఖ పరిధిలో 32 మంది హెల్త్ అసిస్టెంట్లను గతేడాది ఆగస్టు నుంచి సెప్టెంబరు లోపు నియమించారు. న్యాయస్థానం ఆదేశాల మేరకు వీరి నియామకాలు చేపట్టారు. వీరికి పోస్టింగ్‌లు ఇవ్వడానికి సూపరింటెండెంట్ భాస్కర్ కుమార్, సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేసి ప్రస్తుతం ఉద్యోగోన్నతిపై ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న శ్రీనివాసాచార్యులు అక్రమాలకు పాల్పడ్డారన్న ఆరోపణలు వెల్లువెత్తాయి.

6న సర్పంచ్‌ల 'చలో అసెంబ్లీ'

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

గ్రామ పంచాయతీల హక్కుల సాధన కోసం రాష్ట్ర పంచాయతీరాజ్ ఛాంబర్, సర్పంచ్‌ల సంఘం సంయుక్తంగా ఈనెల 6న చలో అసెంబ్లీ కార్యక్రమం చేపడుతున్నట్లు సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షులు గొండు శంకర్ తెలిపారు. నగరంలోని ఆయన కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలోని 12,918 గ్రామ పంచాయతీలకు కేంద్ర ప్రభుత్వం 14, 15 ఆర్థికసంఘం ద్వారా విడుదల చేసిన రూ.8,629 కోట్లను దారిమళ్లించడాన్ని నిరసిస్తూ ఈ ఆందోళన చేపడుతున్నట్లు తెలిపారు. సచివాలయాలు, వాలంటీర్ల వ్యవస్థ, గ్రామ పంచాయతీల నిర్వహణపై సర్పంచ్‌లకు పూర్తి స్వేచ్ఛనివ్వాలని డిమాండ్ చేశారు. సర్పంచ్‌లు, ఎంపిటిసిలకు నెలకు రూ.15 వేలు, ఎంపిపిలు, జెడ్‌పిటిసిలకు రూ.30 వేల గౌరవ వేతనం ఇవ్వాలన్నారు. సర్పంచ్‌ల 16 డిమాండ్లపై ఈ ఆందోళన కొనసాగిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో సంఘ నాయకులు కొంక్యాన ఆదినారాయణ పాల్గొన్నారు.

8న చలో విజయవాడ

ప్రజాశక్తి - నరసన్నపేట, టెక్కలి, కొత్తూరు

ఆశావర్కర్ల సమస్యలపై ఈనెల ఎనిమిదో తేదీన చేపట్టే చలో విజయవాడకు తరలివచ్చి జయప్రదం చేయాలని ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు కె.నాగమణి, అధ్యక్ష, కార్యదర్శులు ధనలక్ష్మి, జి.అమరావతి పిలుపునిచ్చారు. ఆశావర్కర్ల సమస్యలపై టెక్కలి, నరసన్నపేట, పాతపట్నం ఎమ్మెల్యేలు కింజరాపు అచ్చెన్నాయుడు, ధర్మాన కృష్ణదాస్, రెడ్డి శాంతిని శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. పనిభారం తగ్గించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, గ్రూపు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, యాప్‌లు, సచివాలయ డ్యూటీలు రద్దు చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని వినతిపత్రాల్లో కోరారు. రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని విన్నవించారు. సమస్యల పరిష్కారానికి తమవంతు సహకారం అందిస్తామని ఎమ్మెల్యేలు హామీనిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు సిర్ల ప్రసాద్, యూనియన్ నాయకులు అన్నపూర్ణ, రమణమ్మ, రాజేశ్వరి, లక్ష్మి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

అచ్చెన్నాయుడుకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

రాష్ట్రస్థాయిలో మొదటి స్థానంలో నిలవాలి

జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ఆడుదాం ఆంధ్రా రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా మొదటి స్థానంలో నిలవాలని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ అన్నారు. స్థానిక కోడిరామ్మూర్తి మైదానంలో ఆడుదాం ఆంధ్రా జిల్లాస్థాయి పోటీలు ముగింపు కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయిలో గెలిచి, జిల్లా స్థాయికి ఎంతో కష్టపడి చేరుకున్నారని, అదే స్ఫూర్తితో రాష్ట్రస్థాయిలోనూ గెలిచి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. గ్రామస్థాయి నుంచే ఇలాంటి కార్యక్రమం నిర్వహించడం శుభపరిణామమన్నారు. అనంతరం విజేతలకు ట్రోఫీని అందజేశారు. కార్యక్రమంలో సెట్‌శ్రీ సిఇఒ బి.వి ప్రసాదరావు ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా మాజీ కార్యదర్శి పి.సుందరరావు, ఎం.వి రమణ, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ కోచ్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

ట్రోఫీని అందజేస్తున్న జెసి నవీన్

పత్రికా ప్రకటన

పాస్ పోర్ట్ పోయింది. శ్రీకాకుళం జిల్లా బలగమెట్టు, ఆదివారంపేటకు చెందిన **యడ్ల సింహాచలం S/o** యడ్ల మల్లేస్‌కు చెందిన పాస్ పోర్ట్ నెంబర్ M1156340 బలగ నుంచి పెద్దపాడు బైక్ పై వస్తుండగా మార్గ మధ్యలో పడిపోయింది. ఎవరికైనా దొరికిన ఎడల యడ్ల సింహాచలం కు గానీపెద్దపాడు పోలీస్ స్టేషన్‌లో కానీ అప్పగించాలని విజ్ఞప్తి.

9492634776

IN THE HONOURABLE COURT OF THE SENIOR CIVIL JUDGE AT SRIKAKULAM S O P. No. 01 /2024.

Between:
1.Pagoti Mani Krishna
2. Pagoti Sirish Kumar …Applicants
And: **Nil** ...Respondent

GENERAL PUBLIC NOTICE

The public in general are hereby called upon to raise any objections to issue **" SUCCESSION CERTIFICATE "** infavor of the above named petitioners in the above numbered S O P. No. 01 /2024 on the file of the HONOURABLE COURT OF THE SENIOR CIVIL JUDGE AT SRIKAKULAM. In the event of if any successors are there such persons may appear before the above said court with necessary documents if any either in person or through an Advocate to raise objections if any on **20-02-2024 at 10.30 AM.** before the above mentioned Court. Otherwise the Honourable Court will pass decree by issuing **" SUCCESSION CERTIFICATE "** in favour of the above named petitioners to declare them as only Successors to the deceased Sri. Pagoti Appa Rao.

VANA SRINIVASA RAO
ADVOCATE,
NARASANNAPETA, SRIKAKULAM DIST,
CELL NO.95535 44677.

IN THE HONOURABLE COURT OF THE JUNIOR CIVIL JUDGE AT NARASANNAPETA O.S NO.68/2021

Between: **Yeragalla Ramu** ...Plaintiff
And: **Yaragalla Ramanamma and 3 others** ...Defendants

To, **1. Yaragalla Ramanamma,** W/o late Balaji, Hindu, aged about 60 years, House hold duties, R/o H.No:21-327,Netaji Street, Narasannapeta towen & Mandal, Srikakulam District. (D-1)
2. Yaragalla Ramesh, S/o Balaji, Hindu, Aged 32 Years, (D-2) -- Rest Do --

NOTICE

Please take this notice that the Plaintiff has filed the sute againest the defendants for the partition the schedule property and the suit standes posted 8-11-2021, from the said date time to time poste the matter for your apperence and further posted on **16-02-2024,** the plaintiff send the summons through court & R.P's ware returned un served dispite being sent to your correct address finaly Honourable court passed order for paper publication that both of you have to appear before the court **at 10:30 AM, on 16-02-2024** through your advocate or inperson failing which the matter will be decided as Ex-party bye the Honb'le court in your absence.

// By order of the Honb'le court //
R. KRISHNAN NAIDU
Advocate,
NARASANNAPETA
CELL: 9440827999

5న చలో డిఇఒ కార్యాలయం

రణస్థలం : ధర్నా చేస్తున్న మధ్యాహ్న భోజన పథకం కార్మికులు

ప్రజాశక్తి- రణస్థలం

మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు నెలకు రూ.10 వేలు వేతనం ఇవ్వాలని, మెనూ ఛార్జీలు పెంచాలని డిమాండ్ చేస్తూ ఈనెల ఐదో తేదీన చేపట్టే చలో డిఇఒ కార్యాలయం కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మన్నాయుడు పిలుపునిచ్చారు. స్థానిక ఎంఇఒ కార్యాలయం వద్ద మధ్యాహ్న భోజన పథకం కార్మికులు శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలకు వచ్చే విద్యార్థుల సంఖ్యను పెంచడానికి, పిల్లలకు రుచికరమైన పౌష్టికాహారం అందించేందుకు కృషి చేస్తున్నారని అన్నారు. 23 ఏళ్ల నుంచి మధ్యాహ్న భోజన పథకంలో పనిచేస్తున్న కార్మికులతో ప్రభుత్వం వెట్టిచాకిరి చేయిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. సిఎం జగన్ పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు రూ.10 వేలు వేతనం చెల్లించాలన్నారు. ప్రతినెలా 5లోపు వేతనాలు, బిల్లులు ఇవ్వాలని, గ్యాస్ ప్రభుత్వమే సరఫరా చేయాలన్నారు. మార్కెట్‌లో పెరిగిన ధరలకు అనుగుణంగా మెనూ ఛార్జీలు రూ.20లకు పెంచాలని డిమాండ్ చేశారు. ప్రమాదబీమా సౌకర్యం కల్పించాలన్నారు. స్కూళ్లలో ఫస్ట్ ఎయిడ్ కిట్స్ ఏర్పాటు చేయాలన్నారు. ఇఎస్ఐ సౌకర్యం కల్పించాలన్నారు. పథకాన్ని ప్రయివేటు సంస్థలకు అప్పగించరాదన్నారు. భోజన మౌలిక సదుపాయాలైన తాగునీరు, వంటషెడ్, గ్యాస్ స్టవ్ ప్రభుత్వమే కల్పించాలన్నారు. ఏడాదికి రెండు జతల యూనిఫామ్ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఎపి మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ మండల కార్యదర్శి వి.లక్ష్మి, ఎం.రాము, వి.వరలక్ష్మి, కె.ఆదిలక్ష్మి, వి.గౌరి పాల్గొన్నారు.

కొత్తూరు : వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

లావేరు : వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

లావేరు : మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు నెలకు రూ.పది వేలు వేతనం చెల్లించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.వి.రమణ, మధ్యాహ్న భోజన పథకం కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బి.ఉత్తరలు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎంఇఒ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టి అనంతరం ఎంఇఒకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎపి మధ్యాహ్న భోజన పథకం కార్మికులు ఐ.కళావతి, కె.సూర్యకుమారి తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరు : మధ్యాహ్న భోజన పథకం పథకం కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సిర్ల ప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎంఇఒ కార్యాలయం వద్ద కార్మికులతో కలిసి ధర్నా చేపట్టారు. అనంతరం ఎంఇఒ గోవిందరావుకు వినతిపత్రం అందజేశారు.

ఆమదాలవలస-శ్రీకాకుళం రోడ్డుపై కోర్టులో కేసు

ప్రజాశక్తి- ఆమదాలవలస

పట్టణ శివారులో ఉన్న పారిశ్రామిక వాడ వద్ద నుంచి కొత్త రోడ్డు వరకు ఉన్న గుంతల రోడ్డును కనీసం మరమ్మతులు చేయించి ప్రయాణికుల ప్రాణాలను కాపాడాలని కోరుతూ జూనియర్ సివిల్ జడ్జి, చైర్మన్ మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ కోర్టులో న్యాయవాది బొడ్డేపల్లి మోహనరావు కేసు నమోదు చేశారు. ఈ మేరకు శుక్రవారం విలేకరులకు తెలిపారు. ప్రజా ప్రయోజనం రీత్యా కేసు నంబరు 5/24లో కలెక్టర్, రోడ్లు, భవనాల సూపరింటెండెంట్ ఇంజినీర్ వారికి ప్రతివాదులుగా పేర్కొంటూ నోటీసులను పంపించారు. గడచిన రెండేళ్లలో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో సుమారు 20 మంది వరకు ప్రాణాలు కోల్పోయారని, మరో 25 మంది క్షతగాత్రులయ్యారని పేర్కొన్నారు. శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం ప్రయాణిస్తున్న వాహనం సైతం గోతుల్లో పడి త్రుటిలో ప్రమాదం తప్పిన సంఘటన ప్రయాణికులను ఆందోళనకు గురి చేసిందని తెలిపారు. యుద్ధప్రాతిపదికన రహదారి మరమ్మతులు చేసి ప్రయాణికుల ప్రాణాలను కాపాడాలని ఆయన వేసిన వాజ్యంలో అధికారులను కోరారు.

పుష్పగుచ్ఛం అందజేస్తున్న కార్యాలయ సిబ్బంది

అదనపు డిఎంహెచ్‌ఒగా ప్రసాదరావు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లా అదనపు డిఎంహెచ్ఒ, ఎయిడ్స్, టిబి లెప్రసీ నివారణ అధికారిగా డాక్టర్ మజ్జి ప్రసాదరావును ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు డిఎంహెచ్ఒ కార్యాలయంలో శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అదనపు డిఎంహెచ్ఒ బాధ్యతల్లో ఉన్న డాక్టర్ అనురాధ ఇటీవల స్వచ్ఛందంగా ఉద్యోగ విరమణ చేశారు. ఆమె స్థానంలో ప్రసాదరావుకు బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా ఆయనను జిల్లా మాస్ మీడియా అధికారి పైడి వెంకటరమణ, డాక్టర్ పి.ప్రకాశరావు, డాక్టర్ సి.పి.శ్రీదేవి, డాక్టర్ సుజాత, డాక్టర్ వెంకటలక్ష్మి, డాక్టర్ ప్రవీన్‌కుమార్, శైలజ, వెంకటేశ్వరరావు, కె.వి.నారాయణరావు, సూర్యకళ, మోహిని, రమణారావు, వాన సురేష్ అభినందించారు.

మాట్లాడుతున్న మదన్‌మోహన్

హక్కుల కోసం పోరాడుదాం

ప్రజాశక్తి- రణస్థలం

ఉపాధ్యాయులందరూ బాధ్యతలకు నిలబడి హక్కుల కోసం పోరాడుదామని ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు మజ్జి మదన్మోహన్ పిలుపునిచ్చారు. మండలంలోని ఎపిటిఎఫ్ నాయకులు వివిధ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులను శుక్రవారం కలిసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. నాలుగేళ్లలో అపరిష్కృతంగా ఉన్న అనేక ఉద్యోగ ఉపాధ్యాయుల సమస్యల సాధనకు ఎపిటిఎఫ్ నిరంతరం కృషి చేస్తుందని అన్నారు. ఉద్యమాల ద్వారానే ఉద్యోగ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం అవుతాయని అన్నారు. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయేతర పనులను అప్పగించరాదన్నారు. ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన ఆర్థికమైన బకాయిలను ప్రభుత్వం తక్షణమే చెల్లించాలన్నారు. కార్యక్రమంలో ఎపిటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దవల సరస్వతి, పేడాడ లక్ష్మణరావు, రామ్మోహన్, బొంతు అప్పలనాయుడు, సిహెచ్.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

పారదర్శక పాలనతో ఆదర్శం

బూర్జ : శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న స్పీకర్ సీతారాం

పొందూరు: రాష్ట్రంలో పారదర్శికతమైన పాలనను అందించడంలో వైసిపి ప్రభుత్వం దేశంలోనే ఆదర్శంగా నిలుస్తున్నదని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని తోలాపిలో రూ.40లక్షలతో నిర్మించిన నూతన సచివాలయం భవనాన్ని ప్రారంభించారు. అనంతం గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిని ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి లోలుగు కాంతారావు, ఎంపిపి ప్రతినిధి కిళ్లి నాగేశ్వరరావు, సర్పంచ్ పప్పల చిన్నమ్మాయమ్మ, సర్పంచ్ ప్రతినిధి పప్పల రాధాకృష్ణ, పిఎసిఎస్ అధ్యక్షులు కొంచాడ రమణమూర్తి, వైసిపి మండల అధ్యక్షుడు పప్పల రమేష్‌కుమార్, వైసిపి మండల జెసిఎస్ బాడాన వెంకటకృష్ణారావు పాల్గొన్నారు.

ఇంటింటికీ తాగునీరు అందించడమే లక్ష్యం

బూర్జ: ఇంటింటికీ తాగునీరు అందించడమే లక్ష్యమని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని కొరగాంలో రూ.36 లక్షలతో, కటకమయ్యపేటలో రూ.31 లక్షలతో, తమ్మిన్నయుడుపేటలో రూ.40 లక్షల నిధులతో జలజీవన్ మిషన్‌లో భాగంగా ఇంటింటికీ తాగునీటి కుళాయి పనులకు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదల అభ్యున్నతే ధ్యేయంగా సిఎం జగన్మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి బెజ్జిపురం రామారావు, మండల పార్టీ అధ్యక్షులు, ఖండాపు గోవిందరావు, మండల సచివాలయాల కో-ఆర్డినేటర్ గుమ్మడి రాంబాబు, వైస్ ఎంపిపి బుడుమురు సూర్యారావు, సర్పంచ్ ఎం.సుదిష్ణ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

మహిళలకు 'ఆసరా'

ప్రజాశక్తి- కొత్తూరు

పొదుపు సంఘాల మహిళలను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో నాలుగో విడత ఆసరా నమూనా చెక్కును శుక్రవారం అందజేశారు. మండలంలోని 1046 సంఘాలకు, 11,260 మంది డ్వాక్రా మహిళలకు రూ.5.97 కోట్లు మహిళల ఖాతాల్లో జమ చేశామని అన్నారు. అనంతరం సిఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ విద్యాసాగర్, జెడ్‌పిటిసి కె.భాగ్యలక్ష్మి, వైసిపి మండల కన్వీనర్ సారిపల్లి ప్రసాదరావు, పిఎసిఎస్ అధ్యక్షులు చింతాడ సూర్యనారాయణ, సర్పంచ్‌లు కుంచాల రత్నాలు, సారిపల్లి భారతి, సేపేన అశోక్‌కుమార్, ఎంపిటిసి జి.రత్నకుమారి, జి.ఆనందరావు, ఎల్.తిరుపతిరావు, ఎ.నాగేంద్ర, పంకాస్‌దాస్ పాల్గొన్నారు.

కుమార్ నాయక్‌కు ఉత్తమ అవార్డు

కుమార్ నాయక్

పలాస : ఇండియన్ ఫిలిం మేకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన ఈ నెల 4న ఎహతి ఆడిటోరియం తిరుపతిలో జరుగు ఫిలిం ఫెస్టివల్‌లో పలాస-కాశీబుగ్గకు చెందిన డాక్టర్ కుమార్ నాయక్‌కు ఉత్తమ నటుడు అవార్డు ఇవ్వనున్నారు. ఇటీవల విడుదలైన వీరనారి వీర గున్నమ్మ చిత్రంలో చారిత్రాత్మకమైన 'రాజ గురువు' పాత్రలో సజీవ నటనకు ఈ అవార్డు తనకు ప్రధానం చేస్తున్నారని డాక్టర్ ఆశాలత, అనిల్ కుమార్, తనకు ఆహ్వానం పంపారని కుమార్ నాయక్ తెలిపారు.

టిడిపి విజయానికి కృషి చేయాలి

మాట్లాడుతున్న రవికుమార్

ప్రజాశక్తి- పొందూరు

వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి విజయానికి నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ పిలుపునిచ్చారు. పొందూరు టిడిపి కార్యాలయంలో టిడిపి మండల అధ్యక్షుడు చిగిలిపల్లి రామ్మోహనరావు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన జయహో బిసి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాబు ష్యూరిటీ-భవిష్యత్ గ్యారంటీ ద్వారా టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేయనున్న సంక్షేమ పథకాలపై గ్రామాల్లో ముమ్మరంగా ప్రచారం చేపట్టాలన్నారు. వైసిపి ప్రభుత్వం వైఫల్యాలను, అరాచకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లడం ద్వారా రాష్ట్ర భవిష్యత్ టిడిపితోనే సాధ్యమని ప్రజలకు వివరించాలని కోరారు. కార్యక్రమంలో పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు కూన వెంకటసత్యనారాయణ, జిల్లా కార్యదర్శి సీపాన శ్రీరంగనాయకులు, టిడిపి నాయకులు గాడు నారాయణరావు, అన్నెపు రాము, బాడాన శేషగిరినాయుడు, బలగ శంకరభాస్కరరావు, అనకాపల్లి రంగ, అనకాపల్లి వాణి పాల్గొన్నారు.

ఇంటి నుంచి బయట పడేసిన సామగ్రి

అధికార పార్టీ నేత దౌర్జన్యం

ఇంట్లో సామగ్రిని బయటపడేసిన వైనం

ప్రజాశక్తి- నౌపడ

సంతబొమ్మాళి మండలం నౌపడలో వైసిపి కార్యకర్తల దౌర్జన్యకాండ పరాకాష్టకు చేరింది. నిరుపేద మహిళ నీలాపు సుజాత ఇంటిని బలవంతంగా స్వాధీనం చేసుకుని, తాళం వేసిన సంఘటన శుక్రవారం నౌపడలో చోటుచేసుకుంది. తాళలు వేసి, వాటిలో ఉన్న విలువైన సామగ్రిని బయపడేయడంతో బాధిత కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బాధిత మహిళ సుజాత శుక్రవారం నౌపడలో విలేకరుల ముందు బోరున విలపించింది. ఆమె కథనం మేరకు... 16 ఏళ్లుగా నౌపడలో పోస్టాఫీసు రహదారిలో తన రెండు సెంట్ల స్థలంలో కుమారుడు, కుమార్తెతో కలిసి జీవనం గడుపుతున్నారు. ఈ స్థలం ఇంటి యాజమని సింగ్ గతంలో సుజాతకు రాసి ఇచ్చారు. అప్పటి నుంచి ఆమె ఆధీనంలో ఆ స్థలం ఉంది. అయితే ఇటీవల సంక్రాంతి అనంతరం కూలీ పనులు కోసం చెన్నయ్ వెళ్లిపోయారు. దీంతో కొద్దిరోజుల కిందట వైసిపి నేత నీలాపు రామారావు ఆ స్థలంతోపాటు మరో రెండు స్థలాను ఆక్రమించుకున్నారు. దీంతో బాధిత మహిళ సుజాత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. వివాదం కోర్టులో ఉండగానే రామారావు ఆ ఇంటి స్థలాన్ని స్వాధీనం చేసుకుని ఆక్రమించేందుకు తెగబెడ్డారు. బలవంతంగా ఇంటిలో సామగ్రిని బయటకు పడేయడంతో కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఈ విషయన్ని గ్రామ పెద్దలకు చెప్పిన పట్టించుకోలేదని వాపోయింది. బాధిత కుటుంబాన్ని మాజీ సర్పంచ్ కర్రి విష్ణుమూర్తి, టిడిపి నాయకులు లక్ష్మి, మహంతి రాజు పరామర్శించి ఆక్రమణదారుడిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై నీలాపు రామారావుపై సుజాత నౌపడ పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. నిరుపేద మహిళ న్యాయం కోసం పోలీస్‌స్టేషన్‌కు వెళ్తే... ఇదంతా సివిల్ వ్యవహారం అంటూ చెప్పడంపై పలు విమర్శలు వస్తున్నాయి. ఈ విషయమై నౌపడ ఎస్ఐ కిశోర్‌వర్మను సంప్రదించగా ఇంటి పేపర్లు సుజాతపై లేవని, గతంలో సింగ్ అనే వ్యక్తి రామారావుకు రిజిస్ట్రేషన్ చేసినట్లు ఉందని, ఇరువురిని పిలిపించి విచారణ చేపట్టి న్యాయం చేస్తామని తెలిపారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి

కృష్ణారావు మృతదేహం

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

వజ్రపుకొత్తూరుకు చెందిన బత్తిన కృష్ణారావు (55) పలాస రైల్వేస్టేషన్‌లో శుక్రవారం రైలు నుంచి జారిపడి మృతి చెందారు. విజయవాడలో వలస కూలీగా జీవనం సాగిస్తున్నారు. విజయవాడ నుంచి స్వగ్రామం వస్తున్న క్రమంలో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులను కలుసుకోడానికి వస్తున్న సమయంలో ఇలా ప్రమాదంలో మృతి చెందడం గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. మృతుడుకి భార్య పార్వతి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతిపై వైసిపి మండల అధ్యక్షుడు పి.గురయ్యానాయుడు, గ్రామ కమిటీ అధ్యక్షుడు ఇరోతు హేమంతరాజు సంతాపం వ్యక్తం చేశారు.

బాలిక అదృశ్యం

వజ్రపుకొత్తూరు : మండలంలోని నువ్వలరేవుకు చెందిన 16 ఏళ్ల బాలిక అదృశ్యంపై కేసు నమోదు చేశామని ఎస్ఐ మధుసూదనరావు శుక్రవారం తెలిపారు. జనవరి 31 అర్ధరాత్రి నుంచి బాలిక కనిపించలేదని, కుటుంబ సభ్యులు గ్రామ పరిసర ప్రాంతాల్లో, బంధువుల ఇళ్లల్లో వెతికినా ఆచూకీ లభించక పోవడంతో బాలిక తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారని అన్నారు. ఆయన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

మాట్లాడుతున్న సిర్ల ప్రసాద్

పట్టాలను రద్దు చేయాలి

కొత్తూరు : మండలంలోని కడుము కాలనీలో సర్వే నంబరు 28/3లో ప్రభుత్వ అవసరాల కోసం కేటాయించిన స్థలంలో రెవెన్యూ అధికారులు పెత్తందారులకు పట్టాలు మంజూరు చేయడం అన్యాయమని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు సిర్ల ప్రసాద్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం స్థలాన్ని పరిశీలించి కాలనీ వాసులతో మాట్లాడారు. ప్రభుత్వ అవసరాల కోసం కేటాయించిన స్థలంలో స్కూల్, ఆలయం, వాటర్ షెడ్ ఉందని, ఈ స్థలంలో పెత్తందారులకు పట్టాలు ఇవ్వడం సరికాదని అన్నారు. ఈ స్థలంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఆటస్థలం, గ్రామస్తుల కార్యక్రమాలకు ఉపయోగిస్తారని అన్నారు. రెవెన్యూ అదికారులు పున:పరిశీలించి పట్టాలు తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈయన వెంట గోవిందరావు. ఇందువదన, లక్ష్మి, రమణ, చిన్నారావు ఉన్నారు.

రక్తదానం చేస్తున్న యువకులు

రోటరీ క్లబ్ సభ్యుల రక్తదానం

ప్రజాశక్తి- సోంపేట

అనారోగ్యంతో బాధపడుతున్న బల్లెడ చిట్టెమ్మకు అత్యవసరంగా రక్తం అవసరమైంది. సమాచారం అందించిన వెంటనే క్షణాల్లో స్పందించి రోటరీ క్లబ్ సభ్యులు శుక్రవారం రక్తం అందజేశారు. సోంపేట రోటరీ క్లబ్ అధ్యక్షుడు దుద్ది శ్రీనివాసరావు ఆధ్వర్యాన కంచిలి మండలం పెద్దశ్రీరాంపురానికి చెందిన బల్లేడ చిట్టెమ్మకు అత్యవసరంగా ఏ-పాజిటివ్ రక్తం రెండు యూనిట్లు అవసరమైనంది. ఈ మేరకు యువకులు ఎర్ర వాసు, కొడ వాసు, కొండ షణ్ముఖరావు రక్తదానం చేసి బాసటగాని నిలిచారు.

ప్రజారోగ్యానికి పెద్దపీట

ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

లావేరు : ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

లావేరు: ప్రజారోగ్యనికి సిఎం జగన్మోహన్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారని ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ అన్నారు. లావేరులో రూ 1.77 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైఎస్ఆర్ ప్రారంభించిన ఆరోగ్యశ్రీ పథకాన్ని సిఎం జగన్ రూ.25 లక్షలకు పెంచారని అన్నారు. కార్యక్రమంలో డిఎంహెచ్ఒ బొడ్డేపల్లి మీనాక్షి, ఎంపిపి ప్రతినిధి ఆర్.బాలకృష్ణ, జెడ్‌పిటిసి ఎం.సీతంనాయుడు, డిఇ గణపతిరావు, ఎఇ విక్రమ్, ఎంపిడిఒ గొర్లె భాస్కరరావు, సర్పంచ్ ఊర్లాపు లక్ష్మి, జెసిఎస్ ఇన్‌ఛార్జి మీసాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నూతన భవన నిర్మాణం ప్రారంభం

రణస్థలం : మండలంలోని పిసినిలో రూ.40 లక్షల నిధుల వ్యయంతో నూతన సచివాలయం భవనాన్ని ఎమ్మెల్యే కిరణ్‌కుమార్ ప్రారంభించారు. వైసిపి ప్రభుత్వంలో గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చెందుతున్నాయని అన్నారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి పిన్నింటి సాయికుమార్, ఎచ్చెర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రతినిధి లంకలపల్లి ప్రసాద్, మండల పార్టీ అధ్యక్షులు మహంతి పెద్దరామునాయుడు, నెలివాడ సర్పంచ్ పతివాడ లక్ష్మి, ఎంపిడిఒ రమణమూర్తి, ఎఒ ధనుంజయరావు, పంచాయతీ రాజ్ డిఇ సీతంనాయుడు, పంచాయతీ జెఇ కూర్మనాథం,పిసిణి పాల్గొన్నారు.

విధిగా 'భవిష్యత్ గ్యారెంటీ'

సైకిల్ నమూనాను అందజేస్తున్న గౌతు శిరీష

పలాస: టిడిపి నిర్వహిస్తున్న బాబు ష్యూరిటి భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమాన్ని గ్రామాల్లో విధిగా నిర్వహించాలని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష అన్నారు. పలాస టిడిపి కార్యాలయంలో శుక్రవారం టిడిపి సోషల్ మీడియా యాప్‌లో లక్ష పాయింట్లు సాధించిన వజ్రపుకొత్తూరు మండలం వజ్రపుకొత్తూరుకు చెందిన కత్తుర్తి శేషగిరిరావు, మందస మండలం డిమిరియాకు చెందిన ముంజేటి చంద్రశేఖరరావుకు ప్రోత్సాహకం కింద టిడిపి క్లిస్టర్ సైకిల్ నమూనాలు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఇలా పనిచేసే విధంగా చూడాలన్నారు. టిడిపి గెలుపు కోసం కృషి చేయాలని కోరారు. ఆమెతో పాటు టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పి.విఠల్‌రావు, పలాస, మందస మండల అధ్యక్షులు కుత్తుం లక్ష్మణ్ కుమార్, బావన దుర్యోధన, పోలాకి పాపారావు పాల్గొన్నారు.

రేపు పెన్షనర్ల సమావేశం

ఆమదాలవలస : పట్టణంలోని లక్ష్మీనగర్ మున్సిపల్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఈ నెల 4న ఉదయం 10 గంటలకు ఆల్ పెన్షనర్స్ అండ్ విశ్రాంత పర్సన్ అసోసియేషన్ రెండో కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తున్నామని పెన్షనర్ల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సురవరపు సిమ్మినాయుడు బొడ్డేపల్లి జనార్ధనరావులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో పెన్షనర్లకు రావాల్సిన డిఎ బకాయిలు, ఐఆర్ తదితర పెండింగ్ సమస్యలపై చర్చిస్తామని అన్నారు. పెన్షనర్లు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఇళ్లస్థలాలు మంజూరు చేయాలని వినతి

సన్మానిస్తున్న ప్రెస్‌క్లబ్ సభ్యులు

టెక్కలి రూరల్: ప్రభుత్వం ఇచ్చిన అక్రిడేషన్‌తో సంబంధం లేకుండా సంస్థ ఇచ్చిన గుర్తింపు కార్డు పరిగణలోకి తీసుకొని ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని టెక్కలి ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు కూన సుదర్శనరావు కోరారు. ఈ మేరకు ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్‌ను నందిగాం వైసిపి కార్యాలయంలో శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తిలక్ మాట్లాడుతూ నిత్యం వార్తలు సేకరించి ప్రభుత్వానికి, ప్రజలకు వారాధిగా నిలుస్తున్న విలేకరులందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేయడానికి కృషి చేస్తానని హామీనిచ్చారు. అలాగే టెక్కలి ప్రెస్‌క్లబ్ భవన నిర్మాణనికి కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ సభ్యులు బగాది వాసుదేవరావు, లింగుడు రమణ, సుంకు గోపీనాథ్, డి.ఈశ్వరరావు, మార్పు పద్మలోచనరావు, అభిరామ్, వి.రాజేష్, భాస్కరరావు, దంపల బానుప్రసాదరావు పాల్గొన్నారు.

వెదుళ్లవలస పాఠశాలకు సర్పంచ్ తాళం

పోలీసులకు ఫిర్యాదు చేసిన హెచ్‌ఎం

సర్పంచ్ సుదర్శనరావుకు సర్దిచెప్తున్న పోలీసులు

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలోని వెదుళ్లవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆసక్తికరమైన సంఘటన చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే... శుక్రవారం ఉదయం పాఠశాల ఆవరణలో ఉపాధి హామీ కింద కూలీలు జంగిల్ క్లియరెన్స్ చేస్తున్నారు. ఈ సమయంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బుడుమూరు ఈశ్వరరావు, సర్పంచ్ చిలకలపల్లి సుదర్శనరావు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. దీంతో పాఠశాల ప్రధాన గేటుకు తరగతి గదులకు సర్పంచ్ సుదర్శనరావు విద్యార్థులతో తాళాలు వేయించారు. వెంటనే ప్రధానోపాధ్యాయుడు చరవాణిలో పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసు సిబ్బంది గ్రామానికి చేరుకొని పాఠశాలలో జరిగిన వివాదాన్ని తెలుసుకొని సర్పంచ్, ప్రధానోపాధ్యాయుడుకు సర్దిచెప్పి సమస్యను పరిష్కరించారు. అనంతరం తాళాలను తీయించారు. అనంతరం విద్యార్థులు ఈ హెచ్ఎం తమకు వద్దు అంటూ నినాదాలు చేశారు. ఈ సంఘనపై హెచ్ఎం మాట్లాడుతూ నాడు-నేడు ఫేజ్-2 కింద పాఠశాల నిర్మాణాలకు నిధులు మంజూరయ్యాయని, నిర్మాణాలు ప్రభుత్వ నిబంధనల ప్రకారం లేకపోవడంతో తాను అభ్యంతరం తెలిపానని అన్నారు. అధికార పార్టీ నాయకులు చేసిన పనులకు చెక్కులపై సంతకాలు చేయాలని పలుమార్లు ఒత్తిడి తెచ్చినా... తాను లొంగలేదని, ఈ విషయాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని అన్నారు. దాంతో పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయని, అప్పటి సంఘటనలను మనసులో పెట్టుకొని తనని వేధిస్తున్నారని అన్నారు. పాఠశాలలో నిబంధనలను అనుసరించి కచ్చితత్వంతో తాను పనిచేయడంతో తనపై కక్ష పెట్టుకున్నారని అన్నారు. ఇదే విషయమై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పోలీసులు ఫిర్యాదును స్వీకరించలేదని, అందుకనే రిజిస్టర్డ్ పోస్టులో ఫిర్యాదును పంపిస్తున్నానని తెలిపారు.

రేపు 'సాగర సంగ్రామ' దీక్ష

ప్రజాశక్తి- పోలాకి

విశాఖపట్నంలో ఈనెల 4న ఒపిఎస్ సాధన కోసం సాగర సంగ్రామ దీక్ష నిర్వహిస్తున్నామని, ఉపాధ్యాయులు పాల్గొని విజయవంతం చేయాలని సిపిఎస్ ఉద్యోగుల సంఘ జిల్లా ఆర్థిక కార్యదర్శి బాడాన రాజు పిలుపునిచ్చారు. మండలంలోని పిరియాగ్రహం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో శుక్రవారం మధ్యాహ్న భోజన సమయంలో సాగర సంగ్రమ దీక్ష పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిపిఎస్‌ను రద్దు చేయాలని పోరాటం చేస్తుంటే... అంతకంటే ప్రమాదకరమైన జిపిఎస్ విధానం తెచ్చి ప్రభుత్వం మోసం చేసిందని విమర్శించారు. పాత పెన్షన్ పునరుద్ధరణ తప్ప వేరే ప్రత్యామ్నాయం అంగీకరించే ప్రసక్తి లేదని ఉద్ఘాటించారు. యుటిఎఫ్ జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు పి.ఉమాభాస్కరరావు మాట్లాడుతూ పాత పెన్షన్ పునరుద్ధరించే వారికే ఓటు వేస్తామని స్పష్టం చేశారు. సీనియర్ నాయకులు ఎం.శ్యామలరావు మాట్లాడుతూ పాత పెన్షన్ పునరుద్ధరించే వరకు అలుపెరుగని పోరాటాలు చేస్తామని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘ నాయకులు మూల శ్యామలరావు, ఆర్.శ్రీనివాసరావు, సునీల్ గౌతమ్, శ్రీనివాసరావు, రామ్‌శంకర్, పైల వెంకటరావు, ఎం.నరేష్, నిర్మల, జల్లు లక్ష్మి, వేణుబాబు పాల్గొన్నారు.

పోలాకి : పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

కొత్తూరు : మండలంలోని బలద ఎంపియు యుపి స్కూల్‌లో సాగర సమగ్ర దీక్ష పోస్టర్‌ను రామచంద్రరావు, వై.సత్యనారాయణ ఆవిష్కరించారు.

అన్నింటా ప్రభుత్వం విఫలం

శ్రీకాకుళం అర్బన్ : చట్టసభల్లో ఆమోదం పొందిన తర్వాత వాటిని అమలు చేయడంలో వైసిపి ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని మాజీ మంత్రి గుండ అప్పలసూర్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవిలు విమర్శించారు. అరసవల్లిలోని వారి స్వగృహంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. ప్రజల జీవన విధానంలో సామాజికంగా, ఆర్థికంగా, మౌలికంగా మార్పు తేవడానికి చట్టాలు చేసేందుకు చట్టసభలు ఉన్నాయని అన్నారు. ఈ సభలకు ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రభుత్వశాఖల్లో రెవెన్యూ, హోంశాఖలు అత్యంత కీలకమైనవని గుర్తు చేశారు. రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు ఈ చట్టం అమలు చేయడానికి ఉన్న అడ్డంకులు చెతున్నారని అన్నారు. అటువంటిప్పుడు ఈ చట్టం ఎందుకు తెచ్చారో ప్రజలకు జవాబు చెప్పాలని డిమాండ్ చేశారు.

చిత్తడి నేలలు కాపాడుకుందాం

లావేరు : చిత్తడి నేలలను కాపాడుకోవాలని జీవశాస్త్ర ఉపాధ్యాయులు, ఎపి ఎన్‌జిసి జిల్లా కో-ఆర్డినేటర్ పూజారి గోవిందరావు అన్నారు. ప్రపంచ చిత్తడి నేలల పరిరక్షణ దినోత్సవాన్ని మండలంలోని బుడుమూరు ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించారు. చిత్తడి నేలల ప్రాధాన్యతను వివరించారు. 1971లో ఇరాన్‌లోని రాంసర్‌లో జరిగిన తీర్మానం గురించి తెలిపారు. వాటి పరిరక్షణకు పాటుపడతామని విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. ప్రధానోపాధ్యాయులు ఉరిటి శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు ఎస్.కె.ప్రసాదరావు, తమ్మినాయుడు, వెంకటరావు, అనురాధ, చిన పెంటయ్య పాల్గొన్నారు.


ప్రతిజ్ఞ చేయిస్తున్న గోవిందరావు

'అరసవల్లి' తలనీలాలకు వేలం

వేలంపాట నిర్వహిస్తున్న ఇఒ హరిసూర్యప్రకాష్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో ఏడాది కాలం పాటు తలనీలాలు దక్కించుకునేందుకు శుక్రవారం వేలం పాట నిర్వహించారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకు తలనీలాలను సేకరించుకోవడానికి వీలు కల్పిస్తూ హెచ్చు పాట దారుడైన రాజమండ్రికి చెందిన పిల్లి వాసుబాబు రూ. 63,45,000లకు పాట దక్కించుకున్నారు. అలాగే ఈ ఏడాది జనవరి నెలలో సేకరించిన 44 కిలో జుట్టును సైతం ఆయన కొనుగోలు చేశారు. దీనికోసం కిలో రూ.4100 వంతున రూ.1.80లక్షలు చెల్లించి దక్కించుకున్నట్టు ఇఒ వి.హరిసూర్యప్రకాష్ తెలిపారు. పాటలో ఐదుగురు వ్యాపారులు పోటీ పడ్డారని, అత్యధికంగా పాడిన వాసుబాబుకు వేలాన్ని ఖరారు చేసినట్టు తెలిపారు. వేలంలో ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ, దేవదాయ, ధర్మదాయ శాఖ కార్యాలయం నుంచి శ్రీకూర్మం ఇఒ జి.గురునాథరావులు పాల్గొన్నారు.

పుష్పగుచ్ఛం అందజేస్తున్న సచివాలయ ఉద్యోగ సంఘ నాయకులు

కలెక్టర్‌ను కలిసిన సచివాలయ ఉద్యోగులు

ఆమదాలవలస : కలెక్టర్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన మనజీర్ జిలానీ సమూన్‌ను ఎపి గ్రామ వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూన వెంకట సత్యనారాయణ అధ్యక్షతన శుక్రవారం సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్యలపై, పనితీరుపై చర్చించినట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల పట్టణ అధ్యక్షుడు బి.రామినాయుడు, జిల్లా నాయకులు పంగ వెంకట్, వెల్ఫేర్ నాయకులు ముద్దాడ రమేష్ పాల్గొన్నారు.

ధనుంజయరెడ్డికి జాతీయ పురస్కారం

ఇచ్ఛాపురం : మండలంలోని టి.బరంపురానికి చెందిన జానపద కళాకారుడు తిప్పాన ధనుంజయరెడ్డికి జాతీయ పురస్కారానికి ఎంపికయ్యారు. ఈ మేరకు యువచైతన్య వెల్ఫేర్ సొసైటీ విశ్వకర్మ సేవా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యాన స్వామి వివేకానంద, సుభాష్ చంద్రబోస్ జయంత్యుత్సవాలు సందర్భంగా ఈ పురస్కారానికి ఎంపికయ్యారు. ధనుంజయరెడ్డి కోలాటం, జానపద, పండరి భజన రంగంలో విశిష్టమైన కృషి చేశారు. ఈ మేరకు తెలుగు వెలుగు విశిష్ట కళారత్న జాతీయ పురస్కారానికి ఎంపిక చేసినట్లు నిర్వహణ కమిటీ చైర్మన్ బ్రహ్మశ్రీ డాక్టర్ వి. మోహనరావు, కో-ఆర్డినేటర్ బ్రహ్మశ్రీ పోలోజు రాజ్ కుమార్ చార్యులు తెలిపారు. ఈ నెల 4న హనుమకొండ టిఎన్‌జిఒ భవనంలో జాతీయ పురస్కారం అందుకోనున్నారు.

రేపు పూర్వ విద్యార్థుల సమ్మేళనం

శ్రీకాకుళం అర్బన్ : నగరంలోని ప్రభుత్వ మహిళా కళాశాలలో ఈ నెల 4న పూర్వ విద్యార్థుల సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.సూర్యచంద్రరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి కళాశాలలో చదివిన పూర్వ విద్యార్థులందరూ తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు. కళాశాల పూర్వ విద్యార్థుల సంఘానికి ప్రెసిడెంట్ డాక్టర్ ఎం.ఆర్.జ్యోతిఫ్రెడరిక్, వైస్ ప్రెసిడెంట్ ఎస్.ఉమామహేశ్వరి, సెక్రటరీ ఎస్.వి.ఎస్.పూర్ణిమ, జాయింట్ సెక్రెటరీ విజయ్‌కుమారి, ట్రెజరర్ ఎం.చంద్రకుమారి, డాక్టర్ టి.స్వర్ణలత, వై.ప్రశాంతి వ్యవహరిస్తున్నట్లు పేర్కొన్నారు.

నౌపడలో అన్నదానం

నౌపడ : నౌపడలోని రామగిరి బాబా ఆశ్రమంలో 56వ వార్షికోత్సవ సందర్భంగా శుక్రవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. రెండు మంది వరకు నౌపడ, పరిసర ప్రాంతాలకు చెందిన యాత్రికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రజలను ఆకట్టుకున్నాయి. పలువురు సంగీత విద్వాంసులు వారిలో నైపుణ్యాన్ని ప్రదర్శించి ప్రేక్షకులను అలరించారు.

వైద్య శిబిరానికి స్పందన

బూర్జ : మండలంలోని పాలవలసలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా శుక్రవారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు బూర్జ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యాన వైద్యులు రాజశేఖర్, పావనిలు 406 మంది రోగులను పరిశీలించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. అందులో కొంతమందికి మెరుగైన వైద్యం అందించేందుకు రిమ్స్‌కు రిఫర్ చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సరోజని, హెచ్.మురళి, ఎంఎల్‌హెచ్‌పిలు అలేఖ్య, రాధిక, కావ్యశ్రీ, లక్ష్మి, ఎఎన్ఎంలు లక్ష్మీమాలతి, డిసిఎంఎస్ మెంబరు జల్లు బలరాంనాయుడు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారులు

రణస్థలంలో రాజస్థాన్ బృందం పర్యటన

ప్రజాశక్తి- రణస్థలం

మండలంలోని రణస్థలంలో రాజస్థాన్ బృందం శుక్రవారం పర్యటించి ప్రకృతి వ్యవసాయ పంటలను పరిశీలించారు. రణస్థలంలో పెద్దింటి రాజేశ్వరి మొక్కజొన్నలో అంతర పంటలు బెండ, చిక్కుడు, ముల్లంగి, సరిహద్దు పంటగా సజ్జలు మూడు వరుసలు కలుపు నివారణ నిమిత్తం, మొక్కకు కావాల్సిన నత్రజని అందించడానికి మినుములు పంటల ఉపయోగపడుతుందని ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ రేవతి, ప్రకృతి వ్యవసాయ రీజనల్ టెక్నికల్ ఆఫీసర్ హేమసుందర్ వివరించారు. ఈ విధంగా వేయడంతో ఎకరానికి రూ.5 నుంచి రూ.8 వేలు వరకు సంపాదించవచ్చునని అన్నారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో ఘన ద్రవ జీవామృతాలను ఉపయోగించడం వల్ల రైతుకు పెట్టుబడి తగ్గించవచ్చని చెప్పారు. 15 సెంట్లు విస్తీర్ణంలో ఎటిఎం మోడల్ క్షేత్ర సందర్శన చేయించామన్నారు. వర్షాధార పరిస్థితులు విత్తనాలను

పంటలను పరిశీలిస్తున్న రాజస్థాన్ బృందం

నేరుగా వేసినట్లయితే సరిగా మొలక రాకపోవడం జరుగుతుందని, విత్తనాలను పెల్లెటైజేషన్ చేసి నాటుకోవడంతో విత్తనాలకు మొలకెత్తడానికి సరిపడితే ఎప్పుడైతే వస్తుందో అప్పుడు మొలకెత్తుతాయని విత్తనాలను నేలలో ఆరు నెలలు వరకు ఆరోగ్యంగా ఉంటాయని వివరించారు. కార్యక్రమంలో జిల్లా ఎడిషనల్ డిస్ట్రిక్ ప్రాజెక్టు మేనేజర్ ధనుంజయరావు, గోవిందరెడ్డి, బాబాజీ పాల్గొన్నారు.

టిడిపిలో పలువురి చేరిక

పార్టీలోకి ఆహ్వానిస్తున్న అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

సంతబొమ్మాళి మండలం నర్సాపురం పంచాయతీ ఆనందపురం (యర్నాగులపేట)కు చెందిన వైసిపి ఉప సర్పంచ్ దాసరి కిశోర్‌తో 30 కుటుంబాలు, చరణదాసుపురం నుంచి కటారి నరసింహులుతో 20 కుటుంబాలు టిడిపిలోకి చేశారు. వీరికి అచ్చెన్న పార్టీ కండు వేసి టిడిపిలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు బోయిన రమేష్, సంతబొమ్మాళి టిడిపి మోడి రామచంద్రరావు పాల్గొన్నారు.

టిడిపి ప్రభుత్వ హయాంలో మీ సేవ ద్వారా కుటుంబపోషణ జరిగేదని, వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మా బతుకులు రోడ్డున పగ్గాయని జిల్లా మీసేవా నిర్వాహకులు నిమ్మాడలో మర్యాదపూర్వకంగా కలిసి వారి సమస్యలపై వినతి పత్రం అందజేశారు.

జీడి గిట్టుబాటు ధరకు కృషి

ప్రజాశక్తి- పలాస

ఉద్దాన ప్రాంతంలో జీవనాధారమైన జీడికి గిట్టుబాటు ధర కల్పించేందుకు కృషి చేస్తామని జనసేన పలాస నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ వి.దుర్గారావు హామీ ఇచ్చారు. మండలంలోని బొడ్డపాడులో జనం జనం జనసేన ప్రభంజనం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వైసిపి ప్రభుత్వంలో చేసిన అరాచకాలను ప్రజలకు వివరించి టిడిపి, జనసేన సంయుక్తంగా ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో టిడిపి, జనసేన ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని, తప్పకుండా జీడి, కొబ్బరి రైతులకు న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అసంపూర్తిగా ఉన్న

పోస్టర్‌ను అందజేస్తున్న దుర్గారావు

జలాశయాలు, రిజర్వాయర్లు పూర్తికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో పత్రి తాతారావు, పోతనపల్లి చిరంజీవి, రెయ్య హేమసుందర్, రెయ్యి మోహనరావు, బొడ్డు మోహనరావు, గూడ సంజయ్, పోతనపల్లి గిరి, పోతనపల్లి ప్రశాంత్, చంద్రమోహన్, దున్న అఖిల్, గరిక మధు, గేదెల వినీత్, గేదెల సంపత్, తెప్పల సునీల్ పాల్గొన్నారు.

క్రికెట్ విజేతలకు అభినందనలు

ట్రోఫీని అందజేస్తున్న ప్రకాష్

కవిటి: ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల్లో భాగంగా జిల్లాస్థాయి క్రికెట్ విజేతలుగా నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించిన కవిటి క్రికెట్ జట్టు ఇదే ఉత్సాహంతో రాష్ట్రస్థాయిలోనూ సత్తాచాటాలని ఎంపిపి ప్రతినిధి కడియాల ప్రకాష్ ఆకాంక్షించారు. ఆడుదాం ఆంధ్రా జిల్లాస్థాయిలో విజయం సాధించిన కవిటి క్రికెట్ జట్టును శుక్రవారం ఎంపిడిఒ కార్యాలయంలో అధికారులు, ప్రజాప్రతినిధులు అభినందించారు. కార్యక్రమంలో ఉషోదయ యువజన సంఘం అధ్యక్షుడు పాండవ చంద్రశేఖర్, పిఎసిఎస్ డైరెక్టర్ ఎన్ని అశోక్, ఎంపిడిఒ కె.శ్రీనివాస్‌రెడ్డి, ఇఒపిఆర్‌డి శివాజీ పాణిగ్రాహి, ఇఒ వీరభద్రస్వామి, మామిడి సంతోష్ పాల్గొన్నారు.

శ్రామిక కళ్యాణ యోజనపై అవగాహన

పర్లాకిమిడి : శ్రామిక కళ్యాణ యోజన పథకాన్ని సద్వినియోగంచేసుకోవాలని గజపతి జిల్లా పరిషత్ అధ్యక్షులు గవర గణపతిరావు అన్నారు. గజపతి జిల్లా కాశీనగర్ బిజు కళ్యాణ మండపంలో ఒడిశా శ్రామిక కల్యాణ యోజనపై శుక్రవారం అవగాహన కల్పించారు. ప్రమాదంలో మృతి చెందితే రూ.4 లక్షలు, సాధారణ మరణం రూ.2 లక్షలు, ప్రమాదం వల్ల పూర్తి అంగవైకల్యం పొందిన వారికి రూ.1.75 లక్షలు, రెండు అవయవాలు కోల్పోతే రూ.50 వేలు వర్తిస్తాయని వివరించారు. ప్రతి ఒక్కరూ తమ తమ పేర్లు నమోదు చేయించుకోవాలని, ఏటా రెన్యూవల్ చేయించుకోవాలని సూచించారు. జనసేవ కేంద్రాల్లో ఆన్‌లైన్ ద్వారా నమోదు చేయించుకోవాలన్నారు. కాశీనగర్ సమితి అధ్యక్షులు బల్ల సాయమ్మ, జిల్లా శ్రామిక అధికారి లోకనాథ్ పండా, జిల్లా సహాయ శ్రామిక అధికారి అనిల్ కుమార్ బిసోయి, కాశీనగర్ ఎన్ఎసి ఉపాధ్యక్షులు రఘురామ్ సాహు పాల్గొన్నారు.

రేపు అపోటా సమావేశం

కవిటి : కంచిలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఈ నెల 4న ఆంధ్రప్రదేశ్ ఒడియా టీచర్స్ అసోసియేషన్ (అపోటా) సమావేశం నిర్వహిస్తున్నట్టు అపోటా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందావన్ దోళాయి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో అపోటా నూతన కార్యవర్గం ఎన్నికతో పాటు ఒడియా విద్యార్థులు, ఉపాధ్యాయుల సమస్యలపై చర్చించనున్నట్టు పేర్కొన్నారు.

ట్యాబ్‌ల పంపిణీ

ప్రజాశక్తి- ఆమదాలవలస

సిఎం జగన్మోహన్ రెడ్డి విద్యకు ప్రాధాన్యత ఇస్తున్నారని సర్పంచ్ తమ్మినేని వాణిశ్రీ అన్నారు. మండలంలోని తొగరాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి తరగతి చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న ట్యాబులను శుక్రవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో విద్యా కమిటీ చైర్మన్ కె.రాఘువాచార్యులు, ప్రధానోపాధ్యాయులు ఎం.పోలినాయుడు, ఉపాధ్యాయుల పేడాడ కృష్ణారావు, బొడ్డేపల్లి సురేష్ పాల్గొన్నారు. అనంతరం ఎంపిపి ప్రతినిధి తమ్మినేని శ్రీరామ్మూర్తి అదే పాఠశాల విద్యార్థులకు ట్యాబులను పంపిణీ చేశారు. వేర్వేరుగా ట్యాబ్‌లు పంపిణీ చేయడంతో పంచాయతీలో చర్చనీయాంశమైంది.

డాక్టరేట్‌ను అందుకుంటున్న గాయత్రి

గాయత్రికి డాక్టరేట్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

శ్రీకాకుళం నగరానికి చెందిన మంత్రి గాయత్రి కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగంలో డాక్టరేట్‌ను పొందారు. 'వెబ్ యూజర్ బిహేవియర్ పాటర్న్ మైనింగ్ ఫ్రమ్ స్ట్రీమ్స్ ఆఫ్ యూజర్ ఇంట్రాక్షన్' అనే అంశంపై ఆమె పరిశోధన చేశారు. ఈ మేరకు కాకినాడ జెఎన్‌టియు విశ్వవిద్యాలయంలో శుక్రవారం నిర్వహించిన కోత్సవం లో యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ జి.వి.ఆర్. ప్రసాద్‌రాజు చేతుల మీదుగా డాక్టరేట్‌ను స్వీకరించారు. కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగంలో ఎంతో మక్కువతో గాయత్రి చేసిన ఈ పరిశోధన నిష్ణాతుల మన్ననలను పొందింది. జెఎన్‌టియు అకాడమిక్ డైరెక్టర్ ఆర్.రాజేశ్వరరావు, ప్రొఫెసర్ పి.సతీష్‌ల పర్యవేక్షణలో పరిశోధన నిర్వహించినట్లు తెలిపారు.

'తిలక్‌ను విమర్శించడం తగదు'

కోటబొమ్మాళి: ఎలాంటి రాజకీయ కుటుంబం కానప్పటికీ చిన్నతనం నుంచి ప్రజలకు సేవలు చేస్తూ అంచెలంచెలుగా ఎదిగిన వైసిపి ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్‌ను టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు విమర్శించడం తగదని మండల పరిషత్ విప్, చీపుర్లపాడు ఎంపిటిసి బొడ్డు అప్పన్న అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. ఓ మారుమూల గ్రామం, ఓ మధ్య తరగతి కుటుంబానికి చెందిన తిలక్ సర్పంచ్ నుంచి జెడ్‌పిటిసి వరకు ప్రజలతో ఎన్నుకోని అంచలంచలుగా ఈ స్థాయికి వచ్చారని అన్నారు. అచ్చెన్న రాజకీయ కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తి అని పేర్కొన్నారు. అందుకే సిఎం జగన్ గుర్తించి తిలక్‌కు కళింగ కార్పొరేషన్ చైర్మన్, ఇప్పుడు ఎంపీ అభ్యర్థిగా ప్రకటించారని అన్నారు.

ఎస్‌ఐలుగా బాధ్యతల స్వీకరణ

రవికుమార్

పొందూరు : పొందూరు పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐగా వై.రవికుమార్ బాధ్యతలను చేపట్టారు. ఈయన విజయనగరం రెండో పట్టణ ఎస్‌ఐగా పనిచేసి ఇక్కడకు బదిలీపై వచ్చారు. అలాగే ఇక్కడ పనిచేసిన ఎస్‌ఐ లక్ష్మణరావు సిఐగా ఉద్యోగోన్నతి రావడంతో అనకాపల్లి జిల్లా రాంబిల్లికి బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల్లో శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా ప్రశాంతంగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

బూర్జ : బూర్జ ఎస్‌ఐగా జి.వి.ప్రసాదరావు శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఈయన విశాఖపట్నం నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇప్పటి వరకు పనిచేసిన ఎస్‌ఐ అశోక్‌బాబు నరసన్నపేట బదిలీపై వెళ్లారు.

వజ్రపుకొత్తూరు : వజ్రపుకొత్తూరు ఎస్‌ఐగా సిహెచ్.రామారావు బాధ్యతలు స్వీకరించారు. ఈయన జి.సిగడాం నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకు పనిచేసిన ఎస్‌ఐ మధుసూదనరావు జి.సిగడాం బదిలీ అయ్యారు. ఎస్‌ఐకు జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ప్రతినిధి, వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు పాలిన శ్రీనివాసరావు, ఎంపిపి ప్రతినిధి ఉప్పరపెల్లి ఉదయ్ కుమార్, సర్పంచ్‌లు అభినందనలు తెలిపారు.